## గజ్వేల్‌లో 24న గద్దర్ సంస్మరణ సభ

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** ఈనెల 24న ప్రజా యుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ తెలిపారు. ఆదివారం టిపిటిఎఫ్ కార్యాలయంలో సంస్మరణ సభకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు గజ్వేల్ పట్టణంలోని టివైఆర్ గార్డెన్‌లో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుందని, ఈకార్యక్రమానికి ప్రొఫెసర్ కాశిం, ప్రజా గాయకురాలు విమలక్క హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాస్వామికవాదులు, గద్దర్ అభిమానులు, ప్రజా సంఘాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, కో-కన్వీనర్ విద్యాసాగర్, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాపిరెడ్డి, సత్తయ్య, నాగభూషణం, యాదయ్య, రాజయ్య, నాయకులు ఎల్లయ్య, మల్లయ్య, కరుణాకర్, సత్యనారాయణ, సంతోష్, లక్ష్మణ్, వేణు, కృష్ణ, మీనయ్య పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## ఏడుపాయల్లో భక్తుల సందడి

**పాపన్నపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తుల సందడితో అలరారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు పవిత్ర శ్రావణ మాసం కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో, మడుగుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి కుంకుమార్చన, ఒడి బియ్యం నింపడం తదితర పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ శర్మలు వేద మంత్రాలు వల్లిస్తుండగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఇఒ సార శ్రీనివాస్, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్ కుమార్, తోట నరసింహులు, మరునాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్ తదితరులు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.



మెడల్స్ బహుకరిస్తున్న సీపీ శ్వేత

## ప్రతి ఒక్కరూ జీవితంలో వాకింగ్, రన్నింగ్, యోగ భాగస్వామ్యం చేసుకోవాలి : సీపీ శ్వేత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ప్రతి ఒక్కరూ జీవితంలో వాకింగ్, రన్నింగ్, యోగ భాగస్వామ్యం చేసుకోవాలని సీపీ శ్వేత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి రంగనాయకసాగర్ వరకు ఆదివారం 21కె, 10కె హాఫ్ మారథాన్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి యేటా మంత్రి హరీష్‌రావు హాఫ్ మారథాన్ రన్ నిర్వహిస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రతి వారం, నెలలో 5కె, 10కె, 21కె రన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతి, యువకులను, ఉద్యోగులు, వ్యాపారులను భాగస్వామ్యం చేయాలన్నారు. రెండో హాఫ్ మారథాన్ రన్‌ను పది వేలమందితో నిర్వహించాలన్నారు. అరోగ్య రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అరోగ్యాన్ని మించింది మరోటి లేదన్నారు. అన్ని రోగులకు విరుగుడు వాకింగ్, రన్నింగ్, యోగ అని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఆరోగ్యంగా ఉంటనే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సీపీ మెడల్స్ బహుకరించారు. కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాపురెడ్డి, ఏసీసీ కేతినేని సురేందర్‌రెడ్డి, సీఐలు రవికుమార్, కృష్ణారెడ్డి, చేరాలు, భానుప్రకాష్, అథ్లెటిక్ కోచ్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 3న పోచమ్మ తల్లికి బోనాలు : కార్పొరేటర్



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పనగేశ్

**రామచంద్రాపురం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** సెప్టెంబరు 3న శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని 5 గుళ్ల పోచమ్మ తల్లి అమ్మవారికి బోనాల పండగ కార్యక్రమం నిర్వహించేందుకు తీర్మానం చేశారు. ఆదివారం డివిజన్ పరిధిలోని పుర ప్రముఖులు, ప్రజలు, కుల సంఘాల నాయకులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మాట్లాడుతూ అమ్మవారికి బోనాల పండగను పురస్కరించుకుని జిహెచ్ఎంసి సహకారం (శానిటేషన్, ఎలక్ట్రికల్ లైటింగ్, ఎంతమాలజి స్ప్రేయింగ్ తదితర సౌకర్యాలు) అందేలా చర్యలు తీసుకుంటామని, పండగను ఉత్సాహంగా, ఘనంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నాయకులు నిరంజన్‌రెడ్డి, ఎల్వర్తి మల్లేష్, ఆలూరి గోవింద్, గోపాల కృష్ణ, జ్ఞానేశ్వర్‌గౌడ్, మావీన్‌గౌడ్, తొంట నర్సింహా, బైకాన్ సాయిలు, ఊరెళ్ల రాజు, మహేందర్‌రెడ్డి, జనముల బాలరాజు, అశోక్ ముదిరాజ్, రాగం రాంచందర్, కారికే యాదయ్య, కుమ్మరి విఠల్, కుమార్, కారికే దాస్, బేకు యాదయ్య, బల్ల నర్సింగ్, డప్పు యాదయ్య పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్



రోజాశర్మకు హనుమాన్ చిత్రపటం అందజేస్తున్న రమేష్‌గౌడ్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో పురాతనమైన హనుమాన్ దేవాలయాన్ని పునర్నిర్మించి మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆదివారం సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజారాధా కృష్ణశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అతిథులను శాలువాతో సత్కరించి హనుమాన్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అమరావతి, జెడ్‌పిటిసి పంగ మల్లేశం, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, మర్కుక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి కృష్ణాగౌడ్, గుంటుకు రాజు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై వరి నాట్లు వేస్తూ నిరసన

**అల్లాదుర్గం, ఆగస్టు, 20 ప్రభాతవార్త:** అల్లాదుర్గం నుండి గంగ్వార్ వెళ్లే ప్రధాన రహదారిపై ఆదివారం సింగూరు జలాల సాధన కమిటీ అధ్యక్షులు బ్రహ్మం ప్రయాణికులతో కలిసి రోడ్డుపై ఏర్పడిన గుంతలలో వరినాట్లు వేస్తూ వినూత్నంగా నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు ఏళ్ల నుండి అల్లాదుర్గం చౌరస్తా నుండి గంగ్వార్ వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు, చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లు మొత్తం గుంతల మయంగా మారాయన్నారు. ఈ గుంతలలో పడి ప్రయాణికులు తీవ్ర గాయాల పాలైన సంఘటనలు చాల ఉన్నాయి. ఈ రహదారిపై నుండి వందలాది వాహనాలు వస్తూ పోతుంటాయి, ఈ దారి ఎక్కడో కాదూ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ స్వగ్రామానికి కూత వేటు దూరంలో ఉంది. నిత్యం అదే దారిలో వారు ప్రయాణిస్తున్న దారిని సరిచేయకపోవడంతో విచారకమన్నారు. ఈ విషయంపై మంత్రి హరీష్‌రావు చొరవ తీసుకుని రోడ్డు మరమ్మతు చేయాలన్నారు.



రోడ్డుపై వరినాట్లు వేస్తూ నిరసన చేస్తున్న దృశ్యం

# సర్వ శుభకరమాసం...'శ్రావణమాసం'

◆ నేడు పవిత్ర నాగులపంచమి.... ◆ పాండచెరువు కట్టపై పూజలకు ముస్తాబైన నాగదేవాలయం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 20, ప్రభాతవార్త :**

హిందూ సనాతన ధర్మంలో శ్రావణమాసానికి ఎంతో విశిష్టత ఉంది. తెలుగు సంవత్సరంలోని 12 మాసాలలో 5వ మాసంగా ఉన్న ఈ నెలలో పౌర్ణమి నాడు చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచ రించటం వల్ల ఈ మాసానికి శ్రావణమాసంగా పేరు వచ్చింది. ఈ మాసంలో శ్రీమహావిష్ణువును పూజిస్తే ఎంతో పుణ్యం. శ్రీకృష్ణుడు పుట్టినది శ్రావణమాసం లోనే కాగా, శ్రీనివాసుని జన్మదినం ఈ మాసంలోనే. అందుకే శ్రావణ మాసంలో మంగళవారాల్లో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలతో జరుపుతారు. మహిళలు మంగళగౌరి వ్రతాలు నిర్వహించుకుంటారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. మహాలక్ష్మీదేవి కటాక్షం ఉంటుందని శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తుంటారు. అమ్మవారికి కుంకుమార్చనలు, ఎర్రని పూలు, మల్లెమాలలను సమర్పిస్తే రుణ విముక్తి, లక్ష్మీకటాక్షం, సౌభాగ్యం సిద్దిస్తుంది. శ్రావణ శుద్దచవితి, పంచమి రోజున నాగులచవితి, నాగపంచమిని జరుపుతారు. ఈ రోజున పుట్టలో పాలుపోస్తే సర్వదోషాలు తొలిగిపోతాయి. శ్రావణమాసం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు. అమ్మవారికి కుంకు మార్చనలతో పూజలు చేస్తారు. నవ వధువులతో తొలి శ్రావణంలో ఈ వ్రతాన్ని తప్పనిసరిగా ఆచరిస్తారు. అష్టఐశ్వర్యాలు, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థిస్తారు. అదేవిధంగా శ్రావణ మాసంలో వచ్చే పూర్ణిమని శ్రావణపూర్ణిమగా జరుపుతారు. రక్షాబంధన్, జంధ్యాలపౌర్ణమి, రాఖీపౌర్ణమిగా పిలుస్తారు. ఆరోజు సంతోషిమాత జయంతి కూడా కావటంతో అమ్మవారిని ఆరాధిస్తారు. శ్రావణ మాసం కృష్ణపక్ష అష్టమిరోజున శ్రీకృష్ణుడు జన్మించడంతో శ్రీకృష్ణాష్టమిగా నిర్వహిస్తారు. శ్రావణమాసంలో శుక్లపక్ష పంచమిని నాగపంచమి లేదా నాగుల పంచమిగా జరుపుకుంటారు. స్కంద పురాణంలో నాగపంచమి విశిష్టతను సాక్షాత్తు ఆ పరమశివుడే వివరించారు. ఆదిశేషుని సేవకు సంతోషించిన శ్రీమహావిష్ణువు ఓ వరం కోరుకోమంటే అందుకు శేషుడు తాము ఉద్భవించిన పంచమి రోజునాడు సృష్టిలోని మానవాళి అంతా సర్ప పూజలు చేయాలని ప్రార్థించారు. ఆదిశేషుని కోరికని మన్నించిన శ్రీహరి శ్రావణశుద్ధ పంచమి రోజున సర్ప పూజలు చేస్తారని అనుగ్రహించారు. సంతాన భాగ్యం కోసం ఈ పంచమిరోజు నాగులను పూజించి, గోధుమలతో చేసిన పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. పగలంతా ఉపవాసం ఉండి, రాత్రికి ఆహారం తీసుకుంటారు. నాగ పంచమి రోజున నాగులను పూజించిన వారికి విషబాధలు ఉండవు. పవిత్రమైన ఈ రోజున సర్పస్తోత్రాన్ని పారాయణం చేసిన వారికి ఇంద్రియాల వల్ల ఏర్పడే రోగాలు బాధించవు. సంతానం లేని దంపతులు నాగపూజ చేస్తే వంశాభివృద్ధి, కార్యసిద్ధి కలుగు తుంది. కాలసర్ప, నాగదోషాలు తొలగిపోతాయి. త్రేతాయుగంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా ఆదిశేషుడు అవతరించారు. యమునా నదిలో శ్రీకృష్ణుడు కాళీయ మర్దనం చేసిన రోజునే నాగపంచమిగానూ, గరుడ పంచమిగానూ జరుపు కుంటారని ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొన్నారు. నాగ పంచమి రోజున పుట్టకు పూజలుచేసి, పాలు పోస్తారు. నాగదేవతలకు నీరు, పాలు, పసుపు, కుంకుమతో అభిషేకం చేస్తారు.

పసుపు రంగు దారాలను చేతికికట్టుకుంటారు. కొందరు నాగదేవత బొమ్మలను తయారుచేసి పూజలు చేస్తారు. ఈ రోజున మట్టి తవ్వడం, చెట్లను నరకడం చేయ కూడదని పెద్దలు సూచించారు. కాగా రామాయం పేట మున్సిపాలిటీ పరిధిలోని పాండచెరువు కట్టపై వెలిసిన నాగదేవాలయం పంచమిపూజలకు ముస్తా బైంది. పూజారి కూర్మాచలం శ్రీనివాస్ ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించి, నాగమ్మతల్లి పూజలు ప్రారంభించారు. మహిళలు ఎంతో భక్తి శ్రద్దలతో చేసుకునే ఈ పండగకోసం నాగమ్మతల్లి పుట్ట దగ్గరకూడా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



నియామకం పత్రాలు అందజేస్తున్న సూర్యచంద్రవర్మ

## బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమిలేదు

### డిసిసి ఒబిసి సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యచంద్రవర్మ

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ సర్కారు దళిత, బీసీ, మైనార్టీబంద్ పేరిట ఆయా వర్గాల ప్రజలను మోసం చేయడమే తప్ప ఒరగబెట్టిందేమిలేదని డీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ అన్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన మమ్మద్ హర్షద్ హుస్సేన్ టిపిసిసి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, టిపిసిసి మైనార్టీ సెల్ కార్యదర్శిగా సిరాజోద్దీన్, డీసీసీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మోతె కుమారస్వామిలకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియామకం పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓట్ల కోసం సర్కారు కొత్త నాటానికి తెరి లేపిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకే అందుతున్నాయి తప్ప ఎక్కడా అర్హులైన పేదలకు అందడం లేదన్నారు. ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు, బీసీ కులాల్లో కుల వృత్తి చేసుకొని జీవించే ప్రతి కుటుంబానికి బీసీ బంద్ అందించడంతో పాటు మైనార్టీలలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. గూడులేని పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోతే మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామన్నారు. స్వంత స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకోవడానికి ప్రతి ఒక్కరికి గృహలక్ష్మీ పథకం కింద రూ. 3లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. సంటలు నష్టపోయిన రైతులకు నేటికీ ఎక్కడా నష్టపరిహారం అందలేదన్నారు. సామాజిక తెలంగాణ రాలేదని తెలంగాణలో దొరల పాలనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 2 లక్షల రుణ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో మైనార్టీసెల్‌ను మరింత పటిష్టం చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరిని పార్టీ అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాయిని నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సీతాబాలు, బంక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### డంపు యార్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** డంపింగ్ యార్డు నిర్మాణ పనులను వేగవంతంత చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సూచించారు. ఆదివారం నర్సాపూర్‌లోని డంపింగ్ యార్డు స్థలంలో నడుస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి నాణ్యతగా నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి వెంట జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గప్పగారి అశోక్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, కౌన్సిలర్లు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## దేశం కోసం ప్రాణాలర్పించి ధీరుడు రాజీవ్‌గాంధీ

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** దేశం కోసం ప్రాణాలర్పించిన అవిశ్రాంత ధీరుడ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, సోమన్నగారి లక్ష్మీరవిందర్‌రెడ్డి లు పేర్కొన్నారు. ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పుస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మ్యాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థలో సంస్కరణలు, 18 సంవత్సరాలకే ఓటు హక్కుకల్పించడం, ఐటి కమ్యూనికేషన్ ఆవశ్యకతను ముందుగానే ఊహించారని గుర్తు చేశారు. అవిశ్రాంత ధీరుడు, నిరుపేదలకు అండగా నిలిచిన అపద్బాందవుడు గాంధీ వారసత్వాన్ని పుచ్చుకొని దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన నాయకుడని రాజీవ్‌గాంధీ చేసిన సేవలను వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేషం, ఎంపిటిసీ అశోక్, నర్సాపూర్ వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆనంద్, సీనియర్ నాయకులు నర్సింగరావు, నాయకులు రశీద్, మండల ఓబిసి అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్‌గౌడ్, మాల మహానాడు యువజన జిల్లా అధ్యక్షులు దాడిగె నరేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆనేయులు, మన్నె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

## అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతులను ఆపలేరు

**గజ్వేల్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతులను ఆపలేరని బిజెపి రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, నలగామ శ్రీనివాస్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో బిజెవైఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్మల్‌లో మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న మహేశ్వర్‌రెడ్డికి మద్దతు తెలపడానికి వెళ్తున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె.అరుణను అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రణాళికారహితంగా మాస్టర్ ప్లాన్‌తో మున్సిపాలిటీలను నాశనం పట్టిస్తూ బిఆర్ఎస్ నాయకులు ఆస్తుల విలువలు పెంచడమే లక్ష్యంగా పేదల జీవితాలను ఆగం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కామారెడ్డి, ఇప్పుడు నిర్మల్ ప్రతి చోటా పైకి అభివృద్ధి మాట అంటూ లోపల కోట్లాదిరూపాయల భూములను మింగడమే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. హక్కుల కోసం ఉద్యమించిన తెలంగాణ నేలపై ప్రజాస్వామ్య యుతంగా నిరసన తెలియజేసే హక్కు లేకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కాలని భావిస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కల్వకుంట్ల కుటుంబ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకొని రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుత వాతావరణం కల్పించకపోతే బిజెపి ఉద్యమాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కో-కన్వీనర్ సురేష్, మండల అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్, పంజాల అశోక్‌గౌడ్, కోదండం శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి ఎస్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు మైస విజయ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, బిజెవైఎం నాయకులు అనందసాయిగౌడ్, అశోక్‌యాదవ్, నరేందర్, గడ్డమీది ప్రశాంత్, రోహిత్ పాల్గొన్నారు.

## నేడు మద్యం దుకాణాల టెండర్‌లకు డ్రా

జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త: జహీరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 17 మద్యం దుకాణాలకు ధరఖాస్తు చేసుకున్న టెండర్‌లను ఈ నెల 21వ తారీఖున డ్రా ద్వార దుకాణాలను కేటాయించనున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎం అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలోని జేఆర్ఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో ధరఖాస్తు దారుల సమక్షంలో మద్యం దుకాణాలకు డ్రాలు నిర్వహిస్తామన్నారు. మద్యం దుకాణాల కొరకు ధరఖాస్తులు చేసుకున్న ప్రజలు డ్రా కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని అశోక్‌కుమార్ సూచించారు.

## ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు సత్యంకు సన్మానం

**జగదేవ్‌పూర్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన తీగుళ్ళ సత్యంను ఆదివారం జగదేవ్‌పూర్ మండలం అంతాయిగూడెం గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ముదిరాజ్‌లను ఐక్యం చేస్తూ సంఘం అభ్యున్నతికి, సంక్షేమానికి, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా పురోభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నిర్దేశించిన లక్ష్యాలను బాధ్యతాయుతంగా పనిచేస్తూ గ్రామ స్థాయిలో సంఘం పటిష్టతకు, బలోపేతానికి అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గణేష్, ముదిరాజ్ సంఘం మండల యూత్ అధ్యక్షుడు హేమ సురేష్, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మణ్, కనకయ్య, యాదగిరి, మహేందర్, నవీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

**గజ్వేల్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** ఎస్సీ వర్గీకరణ కోసం హైద్రాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో దళిత కాలనీలో దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా దండోరా కార్యకర్తలు సాధించిన విజయాలను ప్రతి పల్లెకు, గడప గడపకు తీసుకెళాకలలన్నారు. హైద్రాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేసే బాధ్యతను అందరం తీసుకోవాలని, మాదిగల సత్తాను చూపించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో దండోరా నాయకులు చెక్‌పోస్ట్ నర్సయ్య, ఈది దుర్గయ్య, రాజి లక్ష్మినర్సయ్య, డాకని బిక్షపతి, గుండ్ర రాంచంద్రం, డాకని చంద్రం, గుండ్ర బాబు, నర్సి యాదగిరి, సైదమొళ్ళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకోం

### - మ్యాడం బాలకృష్ణ

**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20 ప్రభాతవార్త:** మెదక్ ప్రజలకు పట్టిన గ్రహణం కల్వకుంట్ల కుటుంబం అని కాంగ్రెస్ నేత మ్యాడం బాలకృష్ణ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని ఫణంగా పెట్టి తెలంగాణ ఇచ్చిందని, త్యాగం తమదైతే భోగం బీఆర్ఎస్ అనుభవిస్తుందన్నారు. పాస్‌పోర్ట్ బ్రోకర్‌ల కుటుంబానికి కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. గత రెండు పర్యాయాలు అధికారం ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో కల్వకుంట్ల కుటుంబ విఫలమైందన్నారు. దీంతో ప్రజాదరణ కోల్పోయి అధికారం చేజారుతుందనే బాధలో మంత్రి హరీష్‌రావు మతి పోతుందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీపై విషం కక్కుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించేస్థాయి హరీష్‌రావుకు లేదన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అఫీజ్ మోల్‌సాబ్, మాజీ కౌన్సిలర్ విక్రమ్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, ఎస్సీ సెల్ నాయకులు కొండ సంజీవ్, నాయకులు అశోక్‌రెడ్డి, జాకీర్, అమీర్, జకారియా తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

**సిద్దిపేట, ప్రభాతవార్త/బెజ్జంకి/కోహెడ, ఆగస్టు 20, ప్రభాతవార్త:**

భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి వేడుకలను ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన దేశానికి, పేదల అభ్యున్నతి, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

**సిద్దిపేటలో...**

దేశానికి దశా నిర్దేశం చూపిన మార్గదర్శకుడు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అన్నారు. సిద్దిపేట శివారులోని పొన్నాల రాజీవ్ రహదారి సమీపంలో గల అయన విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ తన చివరి ఊపిరి ఉన్నంత వరకు దేశం కోసం నిరుపేదల కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత అయనకే దక్కుతుందన్నారు. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కును కల్పించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ రాజీవ్‌గాంధీ అడుగుజాడల్లో నడుచుకుంటూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం సైనికుల్లా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ లక్కరసు సూర్యచం ద్రవర్మ, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రాములు, మధు, కనకయ్య, స్వామి, రాములుగౌడ్, గయాసుద్దీన్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముక్కిస సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఐటీర ంగానికి పునాదులు వేసి ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. సమాజంలో మహిళలకు, దళితులకు, గిరిజనులకు, మైనార్టీలకు, రాజకీయ శక్తిని అందించిన గొప్పనాయకుడు రాజీవ్‌గాంధీ అన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు మైల ప్రభాకర్, రొడ్డ ల్లేశం, శంకర్, రాజు, నర్సయ్య, తిరుపతి, శరత్, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

**కోహెడలో...**

మండల కేంద్రంలో ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశ ప్రధానిగా ఎన్నో సేవలు అందించారని తెలిపారు. 40 ఏళ్లకే ప్రధాని పీఠాన్ని అధి ష్టించారని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో సంస్క రణలు తెచ్చారని 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ అడుగు జాడల్లో నడుచుకుంటూ దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకవద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శెట్టి సుధాకర్, శ్రీనివాస్, చిన్న కనకారెడ్డి, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, దుర్గాప్రసాద్, శ్రీపాల్, రఘుపతి. మణిదీప్, శ్రీనాథ్ మహర్షి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు





బెజ్జంకిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కోహెడలో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి



మెరుగైన వైద్యానికి సిఎం ఆర్ఎఫ్.చెక్కును అందజేస్తున్న మంత్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్,ఆగస్టు 20 ప్రభాతవార్త: పేదప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, తెలిపారు. మల్కాజిగిరి వినాయక నగర్ ప్రాంతానికి చెందిన మనోహార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 60 వేల రూపాయల చెక్కును ఆదివారం ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్, బిఆర్ఎస్ నేతలు పెద్దాల నర్సింహా,ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ముందుకు రావాలి : లింగాని ప్రసన్న

అడ్డగుట్ట, ఆగస్టు 20 ప్రభాతవార్త: పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. వాయు క్లినిక్ వైద్యులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం తుకారాంగేట్ రియోపాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు సత్తయ్య గౌడ్, ఎల్లయ్య, వడ్లూరి రవి, కిట్టు, గోపి, దేవయ్య, మల్లేశ్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్మీ ప్రాక్టీస్ సెంటర్‌ను తక్షణమే తరలించండి

**పీబెల్‌సిటీ, పీరం చెరువు వాసుల డిమాండ్**




శాంతియుత దీక్ష చేస్తున్న పీబెల్ సిటీ, పీరం చెరువు ప్రాంత వాసులు

ధర్నాచౌక్, ఆగస్టు 20, ప్రభాతవార్త: తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా (తాసా) సిబ్బంది చేపడుతున్న నిరంతర ఫైరింగ్ ప్రాక్టీస్ సెంటర్‌ను తక్షణమే తరలించాలని పీబెల్ సిటీ, పీరం చెరువు ప్రాంత వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వారు శాంతియుత ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మీ ఫైరింగ్ ప్రాక్టీస్ వల్ల ఏర్పడుతున్న శబ్ద కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా దీని వల్ల వారి శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతోందని అన్నారు. నివాస ప్రాంతాలకు దగ్గరగా లేకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ సెంటర్‌ను తక్షణమే తరలించాలని వారు ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీబెల్ సిటీ, పీరం చెరువు ప్రాంత వాసులు మురళీ మోహన్, కిరణ్‌కుమార్, వసంతరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం చేనేత కళాకారులను ప్రోత్సహిస్తుంది

**నగర డిప్యూటీ మేయర్ ఎం.శ్రీలత శోభన్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 20,ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం చేనేత కళాకారులను ప్రోత్సహిస్తుందని, ప్రతిసోమవారం ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు చేనేత వస్త్రాలను ధరిస్తున్నామని నగర డిప్యూటీ మేయర్ ఎం.శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ 12లోని కలింగ కల్చరల్ హాల్‌లో జగ్దీశ్వర్ హస్తకళా ఎక్స్‌పో ఆధ్వర్యంలో హాండ్లూమ్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ తెలంగాణ సాంప్రదాయ వస్త్రాలతోపాటు పలు రాష్ట్రాలోన్ల చేనేత కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి కార్మికులకు చేయూతను అందించాలని కోరారు. రాష్ట్రంలో సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ చేనేత కళాకారులకు ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందించి వారి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను 60స్టాళ్లలో ప్రదర్శిస్తున్నారని ఈప్రదర్శన నెల 28వరకు కొనసాగుతుందని నిర్వాహాకులు రాజేష్‌గుప్త పేర్కొన్నారు.

## 303మంది కళాకారుల తెలుగు వాగ్గేయ వైభవం




సంగీత గురువులను సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, మాణిక్, లలితరావు

రవీంద్రభారతి, ఆగస్టు 20 ప్రభాతవార్త : భారతజాతి గర్వించే విలక్షణ కార్యక్రమానికి శ్రీకారంచుట్టిన రమణరావు, లలితారావు నేతృత్వంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జయహో భారత్ శీర్షికన తెలుగు వాగ్గేయ వైభవం స్వరనీ రాజనం అందించడం, జీనియస్ గ్లోబల్ రికార్డ్ సాధించడం అభినందనీయమని కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ, ప్రముఖ నటుడు మాణిక్‌లు నిర్వాహక సంస్థల సాంస్కృతిక సేవలను కొనియాడారు. జాతీయభావాన్ని, దేశభక్తిని ప్రతిబింబించేరీతిలో 303మంది కళాకారులతో యజ్ఞతుల్యమైన స్వరనీరాజనం నిర్వహించి వీనులవిందు చేశారన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో 77వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జయహో భారత్ శీర్షికన తెలుగు వాగ్గేయ వైభవం పేరున సంగీత ప్రదర్శనలతో స్వరనీరాజనం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన దైవజ్ఞశర్మ, మాణిక్‌లు 15మంది సంగీత గురువులను, ఇద్దరు వాగ్గేయకారులను ఘనంగా సత్కరించారు.

## భారతదేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ధ్రువతార రాజీవ్

**టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం**



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సత్యంశ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 20, ప్రభాతవార్త : ఆధునిక భారతావనికి ఆధ్యుడు, శాస్త్ర, సాంకేతిక విప్లవానికి మార్గదర్శి భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ అని పిసీసీ సభ్యులు డా.సత్యంశ్రీరంగం కొనియాడారు. ఆదివారం రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా కెపిహెచ్‌బి కాలనీలోని రాజీవ్ సర్కిల్‌లో కెపిహెచ్‌బి డివిజన్ అధ్యక్షుడు తుమ్మినేని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సత్యంశ్రీరంగం ముఖ్య అతిథిగా విచ్చేసి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలీకమ్యూనికేషన్స్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్ళిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ, ఐటి రంగాన్ని దేశానికి పరిచయం చేసి ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్‌గాధీకే దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ సమసమాజ స్థాపన కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. నూతన విదేశీ విధానంతో దేశాన్ని ప్రగతిపథంలో నడిపారని, ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో దూసుకుపోతున్న వేళా మన దేశంలోను సాంకేతిక విప్లవం రావాలని తపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, కృష్ణరాజ్‌పుత్, అరవింద్‌రెడ్డి, అప్పారావు, ప్రకాష్, గురుమూర్తి, అజిత్‌రెడ్డి, రంగస్వామి, గోవింద్‌గౌడ్, మహేష్‌గౌడ్, నయీం, అరుణ్‌గౌడ్, శేఖర్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుభాషను పోషిస్తుంది పత్రికలు, పాత్రికేయులే

**ప్రసిద్ధకవి, సాహితీవేత్త : నగ్నముని**

రవీంద్రభారతి, ఆగస్టు 20 ప్రభాతవార్త : తెలుగుభాషను పోషిస్తుంది, కాపాడుతుంది, పరిరక్షిస్తుంది పత్రికలు, పాత్రికేయులు, రచయితలేనని ప్రసిద్ధకవి, సాహితీవేత్త నగ్నముని అన్నారు. తెలుగుభాషకు సంబంధించి ముఖ్యమైన నాలుగు ప్రాంతాలు ఆంధ్ర, తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయలసీమలను దృష్టిలో పెట్టుకొని ఒక నిఘంటువును తయారు చేయాల్సి అవసరం ఎంతైనా ఉందని, అది రచయితలకు, కవులకు చాలా ఉపయోగపడుతుందని, దీని ఆవశ్యకతని ప్రభుత్వం, భాషా పండితులు-పెద్దలు గమనించి తీసుకోస్తే ఈ నాలుగు ప్రాంతాల ఒక మాటని ఏప్రాంతం వారు ఏవిధంగా పలుకుతారో తెలుసుకొని తదనుగుణంగా రచనలు సాగించగలుగుతారన్నారు. పురాణం శ్రీనివాసశాస్త్రి కథల్లో చక్కని పరిశీలన, మంచి అభివ్యక్తి ఉందని, తాను తీసుకున్న విషయం స్పష్టంగా అందంగా చెప్పగలిగే భాష, భావాన్ని సమకూర్చుకునే కుశలత ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కోకిలమ్ సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని ప్రివ్యూ థియేటర్‌లో ఆదివారం ఉదయం పురాణం శ్రీనివాసశాస్త్రి కథలు పుస్తకావిష్కరణ, స్మారక కథా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## ముగిసిన మేరుత్సవ్ 2023 పోటీలు

**85విభిన్న పోటీలతో ఆకట్టుకున్న విద్యార్థులు**




విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త: విద్యార్థుల లోని ప్రతిభ, క్రీడాస్ఫూర్తిని భయటకు తెచ్చేందుకు గత 15రోజులపాటు జరిగిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ పోటీలు "మేరు త్సవ్ 2023" పోటీలు ఆట్టహాసంగా ముగిసాయి. దేశవ్యాప్తంగా ఉన్న 75 స్కూళ్ల విద్యార్థులు తమ ప్రతిభను,సృజనాత్మకతను ప్రదర్శించారు. గ్రేడ్1 నుంచి గ్రేడ్ 12వరకు సుమారు 5500 మంది విద్యార్థులకు 85 విభిన్న పోటీలను నిర్వహించారు. ఈమేరకు మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ముగింపు వేడుకల్లో ప్రిన్సిపల్ సాత్యకి బెనర్జీ విజేతలకు ట్రోఫీలు, పథకాలు అందజేశారు. ఆరువిభాగాల్లో 120మంది విద్యార్థులు పాల్గొనడంతో తైక్వాండో సెగ్మెంట్ అత్యుత్తమంగా నిలిచింది. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్‌కు చెందిన ప్రతినిధులతో నిర్ణయించబడిన సెగ్మెంట్ మంచి ఆటను ప్రదర్శించింది. ఇది ఒక ఈవెంట్‌లాగా కాకుండా యువత అపరిమిత సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. చదువు పుస్తకాలకు మించిందని, విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని అభిప్రాయం వ్యక్తమైంది.

## కలిసి కట్టుగా గెలుపు కోసం కృషి చేయాలి

**ముంబాయి బిజెపి ఎమ్మెల్యే పరాగ్ అల్వాని**



ఎమ్మెల్యే పరాగ్ సన్మానిస్తున్న నాయకులు

తార్నాక, ఆగస్టు 20 ప్రభాతవార్త: రాష్ట్రంలో బిజెపికి మద్దతు ఉందని నాయకులు, కార్యకర్తలందరు కలిసి కట్టుగా గెలుపు కోసం కృషి చేయాలని ముంబాయి ఎమ్మెల్యే పరాగ్ అల్వాని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తార్నాకలోని పింక్ పెరల్స్ హాల్లో అసెంబ్లీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరాగ్ అల్వాని హాజరై మాట్లాడుతూ ఎన్నికలున్న ఈ మూడు నెలల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకమై పార్టీ ఏ కార్యక్రమం చెప్పినా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఏడు రోజుల పాటు నిర్వహించనున్న ఎమ్మెల్యే ప్రవాస్ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, ప్రధా న కార్యదర్శి మేకల సారంగపాణి, కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి తధితరులు ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆదం విజయ్ కుమార్, రవిప్రసాద్ గౌడ్‌తో పాటు నాయకులు బండపల్లి సతీష్, సుక్క గణేష్ ముదిరాజ్, ఆర్.కృష్ణమూర్తి, కనకట్ల హరి, వీరన్న, ప్రభుగుప్తా, శారద మల్లేష్, వెంకటేష్ గౌడ్, హనుమంతు, అంబాల రాజేశ్వర్, పోచయ్య యాదవ్, అనిత, అనిత, రవీందర్ పాల్గొన్నారు.

### ప్రచారంలో బిఎల్ఆర్.. టిక్కెట్ కోసం ఒక్కటైన ప్రత్యర్థులు

ఉప్పల్, ఆగస్టు 20 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ రాజకీయం రసవత్తరంగా మారింది. గత మూడ్దు రోజులుగా ఉప్పల్ ఎమ్మెల్యే టిక్కెట్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డికి ఇస్తున్నారని మీడియాలో ప్రచారం సాగడంతో ఆయన వెళ్లి ముఖ్య నేతలను ఇంటింటికి వెళ్లి కలిసే పనిలో మునిగిపోయారు. ఇప్పటి వరకు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బేతి సుభాష్‌రెడ్డికి సీటు గల్లంతు వార్తలు రావడం ఆయన వర్గీయులు నిరాశంలో ఉండగా, ఇప్పటి వరకు మంత్రి కేటిఆర్ ఆశీస్సులతో టిక్కెట్ వస్తుందని ఆశలు పెట్టుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ వర్గీయులు అయోమయంలో పడిపోయారు. బండారి లక్ష్మారెడ్డికి టిక్కెట్ ఖరారు అయినట్లు మీడియాలో కథనాలు రావడంతో ఆయన ఇంటికి నేతలు క్యూ కట్టారు. సన్మానాలు, ఫోటోలతో కొందరు కింది స్థాయి నేతలు హడావిడి చేస్తున్నారు. మరోవైపు గత కొద్ది రోజులుగా పోటీ పడి విందు రాజకీయాలు చేసిన పలువురు పార్టీ నేతలు రెండు రోజులుగా ఢీలా పడిపోయారు. కులాల వారిగా విందులు ఏర్పాటు చేసి తామే ఎమ్మెల్యే అభ్యర్థి అని ప్రచారం చేసుకున్న కొందరు నేతలు ఏమి చేయాలో తెలియక ఇళ్లకే పరిమితం అయ్యారు. గత రెండు రోజులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గత నెల రోజులగా సాగిన నమస్తే ఉప్పల్ పాదయాత్రను మధ్యలోనే నిలిపివేశారు. టిక్కెట్ అంశం తెరపైకి రావడంతో బిఆర్ఎస్ పార్టీలో గతంలో శత్రువులుగా ఉన్న నేతలు సైతం ఒక్కటిగా మారిపోయారు.

## రాజీవ్ గాంధీ హయాంలోనే దేశం అన్ని రంగాలలోను అభివృద్ధి



రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా చార్మినార్ వద్ద పండ్లు పంపిణీ

చార్మినార్, ఆగష్టు 20 ప్రభాతవార్త : రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో ఆదివారం చార్మినార్ వద్ద మాజీ ప్రధానమంత్రి,దివంగత రాజీవ్‌గాంధీ 79వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి స్థూపం వద్ద సమితి అధ్యక్షులు జి.నిరంజన్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఎగురు వేసిన అనంతరం దివంగత రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాన మంత్రి,స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి సాధించిందని తెలిపారు. 1991లో జరిగిన మతమరమైన అల్లర్ల బాధితులను ఓదార్చేందుకు రాజీవ్‌గాంధీ పాతనగరాన్ని సందర్శించారని ఆయన తెలియజేశారు. దేశంలో కమ్యూనికేషన్, టెకా న్లజీ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ కీలక పాత్ర వహించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్, పులిపాటి రాజేష్ కుమార్, వెంకటేష్ ముదిరాజ్, ఓం ప్రకాష్ శర్మ, జి.దినేష్, శ్యామ్ ముదిరాజ్, ఇక్బాల్, మూసాకాసిం, అబేద్ అలీ, కీష్ణకుమార్, హాజీబుల్లా, అమీర్ అలీ, హైదర్ అలీ జాఫర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సదర్భంగా చార్మినార్ వద్ద ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.



మెబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు శాంతిసాయిజన్ శేఖర్

### రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ఎంతో గొప్పవి

**శాంతిసాయిన్ శేఖర్**

నాచారం, ఆగస్టు 20 ప్రభాతవార్త: రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ఎంతో గొప్పవని స్టాండింగ్ కమిటీ సభ్యులు శాంతిసాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో నాచారం భక్త సమాజం భవనం వద్ద నాచారం సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటీజన్స్, వికలాంగుల కోసం ప్రతి నెల ఒక రోజు ఉచితంగా వైద్య పరీక్షలు కావలసిన వారికి వైద్యం, మందులు అందజేస్తున్నారు. నూతనంగా సీనియర్ సిటీజన్స్, వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన మెబైల్ వాహనాన్ని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సాయిబాబా, ప్రేమ్‌కుమార్, ఎల్లేష్, పాండురంగం, రామకృష్ణ, యాదగిరి, శ్రీశైలం, విఠల్ యాదవ్, కట్టబుచ్చన్న గౌడ్, దాసరి కర్ణ శివకుమార్, రవీందర్ రెడ్డి, రమేష్ గౌడ్,

### దేశంలో సాంకేతిక విప్లవం తీసుకువచ్చిన ఘనత మాజీ ప్రధానీ రాజీవ్‌గాంధీదే

**టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్**

**చిక్కడపల్లి..** దేశంలో సాంకేతిక విప్లవం తీసుకువచ్చిన ఘనత మాజీ ప్రధానీ రాజీవ్‌గాంధీకే దక్కుతుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ అన్నారు. పూర్వ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ 76వ జయంతి సందర్భంగా రామ్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం సంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అంజిరెడ్డి, శ్రీరాములు యాదగింరి, జిఎన్.కేశవ్, అభిషేక్‌రెడ్డి, నాగేంద్ర, సమీద్, అబ్దుల్, చారి, రామకృష్ణ, దశరథ్, తేజగౌడ్, దినేష్, జగదీశ్, నెల్సన్, సందీప్, సునీల్ పాల్గొన్నారు. రాజ్యాంగ సవరణలు తీసుకు వచ్చి పంచాయితీలకే సర్వహక్కులు, అధికా రాలు కల్పించారని, స్థానిక సంస్థలను బలోఓపేతం చేయడంతో పాటు దేశంలో మహిళలకు స్థానికసంస్థల్లో 50శాతం రిజర్వేషన్‌లు కల్పించిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు.

### రాజీవ్‌కు నివాళ్లర్పించిన కాంగ్రెస్ నేతలు

**అడ్డగుట్ట..** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని అడ్డగుట్టలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ చేసిన సేవలను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట రాజు సాగర్, రాష్ట్ర కార్యదర్శి దాడిగ సందీప్‌లు కొనియాడారు. ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపతి హరి, అనంత కృష్ణారావ్, విశాల్, నాగభూషణం, రమేశ్, రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### మూఢ నమ్మకాలు, మతవిశ్వాసాల జాడ్యం పెరిగిపోతుంది

**ఒయు విశ్రాంత అచార్యులు ప్రొఫెసర్ పద్మజా షా**

హైదరాబాద్, ఆగస్టు 20,ప్రభాతవార్త: సమాజంలో మూఢనమ్మకాలు, మతవిశ్వాసాల జాడ్యం పెరిగిపోతుందని ఓయూ విశ్రాంత అచార్యులు ప్రొఫెసర్ పద్మజా షా అన్నారు. జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా మూఢ నమ్మకాల నిర్మూలన - మీడియా పాత్ర అనే అంశంపై పద్మజాషా మాట్లాడారు. 1980 దశకంలో టివిల్లో సాంస్కృతిక ,పురాణదారావాహికలు ప్రసారమయ్యేవని, అవి సంస్కృతికి అద్దంపట్టేలా ఉండేవన్నారు. 90వ దశకం వచ్చే సరికి సాంస్కృతి మతం వైపు మళ్ళిందన్నారు. అది రథయాత్రలు, బాబ్రీ మసీదు కూల్చివేతల వరకు వెళ్లిందన్నారు. గతంలో ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలు ,చర్చా గోష్టిలు జరిగేవని,ఇప్పుడు వాటి సంఖ్య దాదాపు తగ్గిపోయిందన్నారు. ఈసదస్సులో జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు, గంగాజి, డాక్టర్ సోమ మర్ల తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ వీరభద్రీయ(వీరముష్టి) సంఘం స్వర్ణోత్సవ వేడుకలు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, ఆగస్టు 20 ప్రభాత వార్త: తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) సంఘం స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని రూపొందించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. చిక్కడపల్లి కమిటీ సభ్యులు సిహెచ్.సుదర్శన్, కె.వినయకుమార్, పి.గణేష్, సిహెచ్. కొండయ్య, పి.వీరస్వామి, పి.వినయ్, బి.ప్రవీణ్‌రాజ్, కె.కిషోర్‌కుమార్, పి. మధు, పి.సుమన్, పి.విజయరాజ్, పి.హేమంత్, ఏ.నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు. 21న నగరంలోని రవీంద్రభారతిలో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు టి.హరీష్‌రావు, మహమూద్ ఆలీ, డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్, సి.మల్లారెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, ఈటెల రాజేందర్, బలాల, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జాతీయ వీరభద్రీయ సంఘం అధ్యక్షుడు కాటపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొంటారన్నారు.

## గిరిజన మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఎల్‌బినగర్ పోలీసులను అరెస్టు చేయాలి

**వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్‌లో గిరిజన మహిళను చిత్ర హింసలకు గురిచేసి లాకప్‌డెత్‌కు ప్రయత్నించిన పోలీసులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ డిమాండ్ చేసింది. గిరిజన మహిళ వద్ద నుంచి లక్షల రూపాయలు అక్రమంగా గుంజుకొని ఆమెపై తీవ్రంగా దాడిచేయడం అత్యంత దారుణమని, ఈ ఘటనకు ప్రధాన బాధ్యులతోపాటు ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.రవికుమార్, ఎసిపి, డిసిపి, రాచకొండ పోలీస్ కమీషనర్ డిఎస్ చౌహాన్‌లపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని రాష్ట్ర డిజిపిని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈ అమానుష ఘటనపై సిఎం కెసిఆర్, హోం శాఖ మంత్రి మహమూద్ తక్షణమే స్పందించాలని ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరారు. మానవ హక్కులను కాలరాసే విధంగా ఉన్న ఈ ఘటనపైన తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ స్పదించకపోవడం అత్యంత సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణలో కెసిఆర్ సారథ్యంలో పోలీస్ క్రిమినల్ మాఫియా రాజ్యం కొనసాగుతున్నదని ఆరోపించారు. చట్ట వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులను పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. . ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బీరం సతీష్‌కుమార్, దేవునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను తెలుసుకోవడానికి వెళుతుంటే అడ్డుకుంటారా..?

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 20, ప్రభాతవార్త : ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వెళుతున్న తమను అడ్డుకోవడం దారుణమని, ప్రజల సమస్యలు తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సతన్‌నగర్ నియోజవకర్గంలోని ఎస్ఆర్‌నగర్ డివిజన్‌లో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం రాజీవ్‌గాంధీ విగ్రహానికి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రజలు తమ సమస్యలను వివరించే క్రమంలో అక్కడి బిఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. ఇది తమ ప్రాంతమని తమ ప్రాంతంలో వేరే పార్టీల నాయకులు ఎవరూ పర్యటించే హక్కులేదని కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్నారు. అక్కడ తీవ్ర ఉద్రిక్తల మధ్య నీలిమ బస్తీ పర్యటనను కొనసాగించారు. బిఆర్ఎస్ నాయకుల అగడాలు ఎక్కువ అవటంతో స్థానిక ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నీలమ మాట్లాడుతూ రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుందని తమనకు కనీసం బస్తీలలో పర్యటించే హక్కు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమను అడ్డుకున్న వారిని అరెస్టు చేయాలని ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు.

## ఎన్ఆర్ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

యూసుఫ్‌గూడ, ఆగష్టు 20, ప్రభాతవార్త : బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం సైట్ 1లోని తురేబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈససమావేశంలో కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ పరిశీలకులు మెహరాజ్ ఉన్నీసబేగం, పాల్గొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలతో పాటు ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ జివో విడుదల కావడంతో కమిటి సభ్యులు ఆనందం వ్యకతం చేశారు. రాబోయే రోజుల్లోన్ల అనిన కాలనీల సంక్షేమ సంఘాలతో పాటు స్థానిక ప్రజల సహకారంతో ముందుకు వెళతామన్నారు. ఇప్పటికే కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో నివాసితుల ప్రధాన సమస్య థర్డ్ పార్టీ రిజిస్ట్రేషను పరిష్కరించే దిశగా స్థానిక శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ ఎంతో శ్రమించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్ళి జీవోను విడుదల చేయించారని తమ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ తరపున వారిని ఎప్పటికి గుర్తించుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో కోఆపరేటవ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు ఎమ్ఏ సత్తార్, కార్యదర్శి అహ్మద్ ఆలీ, ఉపాధ్యక్షులు సత్తాజీ, కోశాదికారి షేక్ యూసుఫుద్దీన్, మానేజింగ్ కమిటి సభ్యులు కె.అంజయ్య, ఎమ్ఏ రహమాన్, ఎమ్‌డి ఇమామ్ గౌరి, సి.సత్యనారాయణ, రాములు, అక్తార్ సుల్తానా, అమృత, సూపర్ వైజరీ కౌన్సిల్ సభ్యులు ఎమ్‌డి జహంగీర్, వెంకటేష్, సియస్ రామ్మోహన్‌రావు, అబ్దుల్ అహ్మద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంది

**జూబ్లీహిల్స్ మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి**



జవహర్‌నగర్‌లో ఇంటిటికి పాదయాత్రలో పాల్గొన్న జూబ్లిహిల్స్ మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఆగష్టు 20, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ అన్ని వేళల ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని నాయకులు కార్యకర్తలకు ఎప్పటికి అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ అనీ జూబ్లీహిల్స్ మాజీ శాసన సభ్యులు పి. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బిట్ల సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఇందులో నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్ళి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మహిళలు పెద్ద ఎత్తున హారతులతో స్వాగతం పలికారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని కింది స్థాయినుంచి ప్రజలు పార్టీని బలోపేతం చేసేదిశగా ముందుకు వస్తున్నారన్నారు. గతంలో తాము ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఈప్రాంతాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. తమకు రాబోయే రోజుల్లో మరో మారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో అర్జున్, వీరస్వామి, మహేందర్, కబీర్, దూడల రవిగౌడ్, ఎర్రకృష్ణకుమార్, ధనవీర్ పాల్గొన్నారు.

## కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గోపాలయ్యను కలిసిన బిజెపి నాయకులు



కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గోపాలయ్యను కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సన్మానిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఆగష్టు 20 ప్రభాతవార్త : ప్రవాస్ యోజన్‌లో భాగంగా రానున్న ఎన్నికల నేపథ్యంలో బిజెపి హై కమాండ్ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి పరిశీలకులుగా పంపించిన కర్ణాటక మాజీ మంత్రి,ఎమ్మెల్యే గోపాలయ్యను ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్,జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కలిసి సన్మానించారు. డివిజన్ పరిధిలోని శంకరప్ప స్టేట్ ప్రెసిడెంట్ తెలంగాణ, లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ పటేల్,డాక్టర్ గురురాశితో పాటు పలువురు స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్ణాటక ఎమ్మెల్యే గోపాలయ్యను కలిశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లేష్ యాదవ్,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,కొమరాన్న మహే ముదిరాజ్,శాంత్ కుమార్,మంజు,శివ,ఎడ్లకడి రవి,జగన్ మోహన్,గడ్డం నవీన్,సంతు కుమార్,బాబూరావు, టి.చిన్న,పాండు యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో రాజీవ్ గాంధీ కీలకపాత్ర

**ఆదం సంతోష్‌కుమార్**



వారాసిగూడ నుండి నామాలగుండు వరకు నిర్వహిస్తున్న ర్యాలీ

సికింద్రాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త: మజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వారాసిగూడ చౌరస్తాలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఇక్కడి నుండి నామాలగుండు వరకు పాద యాత్ర జరిపారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా చేసిన చేసిన సేవలను కొనియాడారు. చిన్న వయస్సులోనే ప్రధానమంత్రిగా బాధ్య తలు చేపట్టి యువతరానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. పంచాయతీరాజ్ చట్టం ద్వారా గ్రామాల అభివృ ద్ధికి పునాది వేశారని తెలిపారు. నేటి డిజిటల్ రంగం అభివృద్ధికి ఆనాడు రాజీవ్ గాంధీ కమ్యూనికేషన్ రంగాన్ని అభివృద్ధి చేయడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆదం సృజన్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, జయ రాజ్, అమర్‌నాథ్ గౌడ్, సందీప్, అబ్బుబాయ్, గౌస్, లింగారెడ్డి, సతీష్, మహేందర్, దాము పాల్గొన్నారు.

## మూడో సారి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది : గజ్జెల నాగేశ్



ఇంటింటికి పాదయాత్ర చేపట్టిన గజ్జెల నాగేశ్ తదితరులు

తిరుమలగిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని 7వ వార్డు గాంధీ నగర్‌లో ఇంటింటికి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు లేవు, కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత రాష్ట్ర ముఖ్య మంత్రి కేసిఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో కేసిఆర్ సంక్షేమ పథకాలే విజయానికి నాంది పలుకుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సత్య నారాయణ గౌడ్, జంగిలి రాజు, రావుల సతీష్, నిత్య, మోసీన్, శివ, సాయికిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా అంశాలపై బిజెపి కార్యాలయంలో అవగాహన



భాస్కర్‌ను శాలువాతో సత్కరిస్తున్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 20, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సోషల్‌మీడియా, వాల్ పేయింటింగ్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర అందేరి శాసనసభ్యులు అమిత్ భాస్కర్ పాల్గొని సోషల్ మీడియాలో చేపట్టే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరోసారి మోదీ సర్కార్ తెలంగాణాలో ఈసారి బిజెపి ప్రభుత్వం అని వాల్ పెయింట్ వేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, హర్షనపల్లి సూర్యరావు, నాయినేని సూర్యప్రకాష్‌రావు, కూకట్‌పల్లి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, సోషల్‌మీడియా కన్వీనర్లు, వివిధ మోర్చల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 20 ప్రభాతవార్త: కెసిఆర్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళలాగా బిఆర్ఎస్ పాలన సాగుతున్నదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర శివార్లలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28, 29 డివిజన్లలో ఆదివారం సాయంత్రం రూ. 2.72 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డిలతో కలిసి మంత్రి సిసి రోడ్లు, సీవరేజ్ వాటర్ పైప్‌లైన్ల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాల్లో లేని విధంగా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు పోతున్నదని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి నినాదాలుగా అవే విధానాలుగా చేసుకొని ప్రభుత్వం ప్రజల మన్నలను పొందుతున్నదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బడుగు సుమన్ రావు, పలువురు కార్పొరేటర్లు, బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## బోనాలు, బతుకమ్మ పండుగలు తెలంగాణ

**సంస్కృతికి నిలువుటద్దాలు: మంత్రి తలసాని**

సికింద్రాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త : బోనాలు, బతుకమ్మ లాంటి పండుగలు మన సంస్కృతిని చాటుతాయని, వాటిని భవిష్యత్ తరాలకు కూడా అందించడం తెలంగాణ ప్రభుత్వం బాధ్యతాయుంగా వ్యవహరిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పద్మారావునగర్ పార్కులో నిర్వహించిన బోనాల ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా పార్కులోని వనదేవత మాత అమ్మ వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నిర్వాహకులు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల సందర్భంగా అందరు ఒకచోట కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పండుగలు, ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని వాటి పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రణధీర్ రాజు, నాయకులు శ్రీకాంత్, ఏసూరి సావిత్రి, రమణ, ముక్కా శ్రీను, కుమార్ యాదవ్, వివిధ కాలనీలకు చెందిన ప్రతినిధులు, శ్రీనివాస్ గౌడ్, నర్సాగౌడ్, జగ్గయ్య, కృష్ణారావు, వజీర్, మోహన్, భగవంతరావు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



బోయిన్‌పల్లిలో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు బొల్లు కిషన్, జీవకన్, దేవుడు, పిడమర్తి రవి

కంటోన్మెంట్, ఆగస్టు 20 ప్రభాతవార్త: దేశ ప్రజల కోసం ప్రాణాలర్పించిన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు బొల్లు కిషన్, మల్లారెడ్డి, జీవకన్, దేవుడు, పిడమర్తి రవిలు తెలిపారు. భారత మాజీ రాజీవ్ గాంధీ 79వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి చౌరసస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కంప్యూటర్ రంగాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. బంజరు భూములను దళితులకు అప్పగించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం బల్వంత్ రెడ్డి, శ్యామ్‌సన్ రాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింహన్, కన్నన్, గజ్వేల్ భరత్, అ స్రఫ్, యేసురత్నం, రాము, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాచి కులస్తుల అభివృద్ధి కోసం కృషి




పమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న కాచి సంఘం సభ్యులు

మెహిదీపట్నం, ఆగస్టు 20, ప్రభాతవార్త : కాచి కులస్తుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆ సంఘం అధ్యక్షులు ఎం. పురుషోత్తం సింగ్ తెలిపారు. బస్తీ అభివృద్ధి కోసం కాచి కులస్తులందరు కృషి చేయడంతో పాటు సంఘానికి సహకరించాలని కోరారు. ఆదివారం కార్వాన్‌లోని కాచి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కాచి సంఘం నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎం. పురుషోత్తం సింగ్ మాట్లాడుతూ..కాచి కులస్తులందరి సహాయ, సహకారాలు అందించడంతోనే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల తరువాత బస్తీ అభివద్దే ముఖ్యమన్నారు. బస్తీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యాక్రమంలో కాచి సంఘం ఉపాధ్యక్షులు ఎం.కుందన్ లాల్‌సింగ్, ఎం. సినోథ్‌సింగ్, ఎస్.అజయ్‌సింగ్, జనరల్ సెక్రటరీ బి.థిలక్‌సింగ్, జాయింట్ సెక్రటరీ బి.హరిశ్యాంసింగ్, హెచ్.చతుర్‌వేది సింగ్, ఏ.సుభాష్ సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. నితేష్‌సింగ్, ట్రెజరరీ ఎం.సోహాన్ సింగ్, అసిస్టెంట్ ట్రెజరరీ ఏ.రాజేష్ సింగ్, స్టోర్ ఇన్‌చార్జి హెచ్.జగనాథ్ సింగ్‌ల కాచి కులస్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన లోక్‌దళ్ పార్టీ

సైఫాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటి చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రకటించింది. సిఎం కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం గత 9 సంవత్సరాలలో ఆనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినందుకే మద్దతు ఇస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు డబుల్ బెడ్ రూంలు, కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, దళిత బంధు, రైతు బంధు, బిసిలకు, మైనార్టిలకు ఒకలక్ష రూపాయలు ఆర్థిక సహాయం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి విద్యార్థులకు హాస్టల్స్, గురుకులాలు, ఉద్యోగాల భర్తీ తదితర మరిఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేట్టిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ముఖ్యంగా మత ఘర్షణలు లేవని, శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని ప్రజలు సుఖంగా, ప్రశాంతగా జీవిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలను నమ్మి ప్రజలు మోసపోరాదని, కాంగ్రెస్ పార్టీ అవినీతిదని, బిజెపి మతాన్ని రెచ్చగోట్టి పబ్బం గడుపుకుంటుందని ఆయన నిశితంగా విమర్శించారు.

## చరిత్రను ఒడిసిపట్టిన వారు రచయితలు కవులు

**జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**




సభలో ప్రసంగిస్తున్న జాజులశ్రీనివాస్‌గౌడ్, జేహింద్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, కుల్కచర్లశ్రీనివాస్, బడేసాబ్

రవీంద్రభారతి, ఆగస్టు 20 ప్రభాతవార్త : రచయితలు కవులంటే దాదాపు చరిత్ర ఒడిసిపట్టిన, సమాజంలో మంచి చెడులను అధ్యయనం చేసిన వారని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బహుజన చక్రవర్తి, గోల్కొండ కోటను ఏలిన మహరాజు సర్దార్ సర్వాయిపాపన్న 373వ జయంతి సందర్భంగా బడేసాబ్ నిర్వహణలో కవిసమ్మేళనం నిర్వహించడం హర్షదాయకమని, చరిత్ర ఉద్యమకారులతో, రాజకీయనాయకులతో, పాలకులతో నిలబడదని, అది కేవలం కవులు రచయితలతోనే సాధ్యమని, చరిత్రను ఎవ్వరూ మార్చలేరని, క్షత్రీయుడే కాదు బహుజనుడు కూడా రాజ్యాధికారం చేయొచ్చని పాపన్న నిరూపించాడని, ఈ భూగోళం, సూర్య చంద్రులున్నంతకాలం భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో, చరిత్రలో సజీవంగా నిలిచే ఉంటాడని, ఆయన జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం కావాలన్నారు. కవుల తమ కలానికి పదునుపెట్టి బహుజన రాజ్యాధికారం సాధించిననాడే పాపన్నగౌడ్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. తెలుగుభాష చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్ సభాధ్యక్షతన జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాజుల శ్రీనివాస్‌గౌడ్, విశిష్ట అతిథిగా సర్వాయి పాపన్నగౌడ్ ట్రస్టు ఛైర్మన్ పి.జేహింద్‌గౌడ్, గౌరవ అతిథులుగా బత్తిని రాజుగౌడ్, కనకాల శ్యామ్, విక్రమ్‌గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, లింగంగౌడ్, ఈడిగ శ్రీనివాస్, నరసింహనాయక్, సతీష్‌గౌడ్ తదితరులతో కలిసి కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులను ప్రశంసాపత్రంతో సత్కరించారు.

## తాగుబోతుల తెలంగాణాగా మార్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**

ధర్నాచౌక్, ఆగస్టు 20, ప్రభాతవార్త: త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంను తాగుబోతుల తెలంగాణగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టీడీపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మద్యం అమ్మకాలను ప్రోత్సహించి, మద్యంపై బతుకుతున్న తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గు లేదని మండిపడ్డారు. మద్యం దుకాణాలకు ప్రభుత్వం టెండర్లు వేస్తే 2,620 దుకాణాలకు 1,31,000 పైగా దరఖాస్తులు వచ్చాయని, ఒక్కొక్క దరఖాస్తు ద్వారా రెండు లక్షల చొప్పున మొత్తం 2,697 కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 26 శాతం ఉన్న మద్యం ఆదాయం ఇప్పుడు 75శాతానికి పెరిగిందని, అంటే తెలంగాణ ప్రభుత్వం మద్యం పైనే ఆధారపడి నడుస్తోందనేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మద్యానికి అలవాటు పడ్డ సామాన్య పేద ప్రజలు పెళ్లాల పుస్తెలు అమ్మి తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు పేరుతో వచ్చిన తెలంగాణలో నేడు వైన్ షాపులు, బెల్టు షాపులు, బార్లు రాజ్యమేలుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్రాచారి, శ్యాం సుందర్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## మహిళలకు అండగా షీ టీమ్స్

మెహిదీపట్నం, ఆగస్టు 20, ప్రభాతవార్త : మహిళలు, విద్యార్థులు, బాలికలకు ఎప్పుడు, ఎక్కడ, ఎలాంటి ఆపదరాకుండ చూసేందుకు షీ టీమ్స్ ఉన్నాయని, షీ టీమ్స్‌ను మహిళలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్.ఐ.పల్లవి కోరారు. మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలోని విద్యార్థినీలకు షీ టీమ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ.పల్లవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థినీలు ఎప్పుడు ధైర్యంగా ఉండాలని, ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలన్నారు. విద్యార్థినీలు అభద్రత భావాన్ని వీడి ముందుకు సాగాలని సూచించారు. భయపడి తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వారికి సహాయం చేసేందుకు విద్యార్థినీలు ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో మహిళల భద్రత కోసం షీ టీమ్స్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. సమావేశంలో ఎస్.ఐ సంగమేశ్వరిలేజి, కళాశాల డీన్ డాక్టర్ మహిత, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## నర్సింగ్‌రావు చేసిన సేవలు మరువలేనివి



నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బిజెపి నేతలు

హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త: బిజెపి గోల్నాక డివిజన్ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ సంగీతం నర్సింగ్‌రావు పార్టీకి, పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు కొనియాడారు. నమ్మిన పార్టీ సిద్ధాంతాల కోసం ప్రాణాలు ఉన్నంత వరకు ఆయన సేవలు అందించారని చెప్పారు. ఆదివారం గంగానగర్‌లో నర్సింగ్‌రావు 5వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గౌతంరావు, జోగులాంబ గద్వాల్ జిల్లా బిజెపి ఇన్‌చార్జీ బి.వెంకట్‌రెడ్డి, నాయకులు రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, మూల రవీందర్‌గౌడ్, నాగభూషణం చారి తదితరులు నివాళులు అర్పించారు. నర్సింగ్‌రావు సేవలను ప్రశంసించారు

## ఆర్.కృష్ణయ్యకు ప్రజా ఉద్యమ శిఖర పురస్కార ప్రదానం

రవీంద్రభారతి, ఆగస్టు 20 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, గీతగోవిందగీతికలు, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 21 సోమవారం మధ్యాహ్నం 1.30నుండి రాత్రి 9.30గంటల వరకు ఎమ్మెల్సీ ఎస్.మదుసూదనాచారి సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న హోంమంత్రి మహ్మూద్‌అలీ విశిష్ట అతిథులు కోలేటి దామోదర్ గుప్త, నవరస గాయని ఆమని, వై.విజయకుమార్ తదితరులతో కలిసి 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే ఉత్తమ సేవలందించిన పోలీసులుగా గుర్తింపు పొందిన బోధన్ ఏసిపి కె.ఎం.కిరణ్‌కుమార్, సిఐడి డీఎస్పీ భూపతి శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఏసిపి డా. ఎం.జితేందర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అదనపు ఎస్పీ ఎ.వెంకటేశ్వర్‌రావు, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ మేకల తిరుపతన్నలను ఘనంగా సత్కరించి శృతిలయ ప్రతిష్టాత్మక ప్రైడ్ ఆఫ్ ఇండియా; రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి : ఇటుక శ్రీకిషన్ మాదిగ

కంటోన్మెంట్, ఆగస్టు 20 ప్రభాతవార్త: తిరుమలగిరి మండలం పరిధిలోని సర్వే నెం 157బై 1లలో ఉన్న ప్రభుత్వ ఖాళీ భూమిని కొందరు భూ కబ్జాదారులు ఆలయాల పేర్లతో ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ స్థలాన్ని పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బోయిన్‌పల్లిలోని ఎన్.ఐ.ఎం.హెచ్.మానో వికాస్ నగర్ సెంటర్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో కొందరు భూ ఆక్రమణ దారులు ఆక్రమించుకోవడా నికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇటుక గోపి మాదిగ, అజిత్ కళ్యాణ్, రాజు, శ్రీను, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడాలి



రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ప్రెషర్ కుక్కర్లు పంపిణీ చేస్తున్న టీపీసీసీ సభ్యుడు, ఎంసిఆర్ ఎఫ్ ఛైర్మన్ మర్రి ఆదిత్యారెడ్డి

బేగంపేట ఆగస్టు 20, ప్రభాతవార్త : బస్తీల్లో నివసించే పజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు చెందాలని టీపీసీసీ సభ్యుడు, ఎంసీఆర్ఎఫ్ ఛైర్మన్ మర్రి ఆదిత్యా రెడ్డి అన్నారు. ఆదివారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు త్రికాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్రి ఆదిత్యారెడ్డి డివిజన్ పరిధిలోని ఓల్డ్ గాస్ మండీ, విక్టోరియా గంజ్, చుట్టల బస్తీ, అంబేద్కర్ నగర్ లలో ప్రెషర్ కుక్కర్లు, నిత్యావసర వస్తువులు, చీరెలు, చిన్నారులకు లంచ్ బాక్సులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆదిత్యారెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్‌గాంధీ 90వ దశకంలో చెన్నారెడ్డితో దగ్గరగా పనిచేసారని, ఆరు నెలల్లో ఎన్నికలు సమీపిస్తాయనగా 1989లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న చెన్నారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 108 స్థానాల్లో విజయం సాధించారని, ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఆ సమయంలో రాజీవ్ గాంధీ మర్రి చెన్నారెడ్డితో తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలని అంశాలపైన ఎక్కువగా మాట్లాడేవారన్నారు, చెన్నారెడ్డి ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గణేష్ టెంపుల్ మాజీ ఛైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు విట్టల్, చక్రం, చందు, కిరణ్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు అన్యాయం చేయరాదు



సిఐతో మాట్లాడుతున్న జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త: గత నాలుగు దశాబ్దాలుగా ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న పేదలకు ఎదొక ఉపాధి కల్పించేంతవరకు ఇబ్బందులకు గురిచేయరాదని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పోలీసులు చిరు వ్యాపారులకు నోటీస్‌లు జారీ చేసిన నేపథ్యంలో చిరువ్యాపారస్తులతో కలిసి ఆమె ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ సత్యనారాయణను కలిసి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేంతవరకు వ్యాపారులకు అన్యాయం చేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్‌గౌడ్, నగర నాయకులు నర్సింగ్‌గౌడ్, మల్లేష్, వేణుగోపాల్‌యాదవ్, ప్రవీణ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మతల్లి తెప్పోత్సవం



గంగమ్మతల్లి తెప్పోత్సవం సందర్భంగా శోభాయాత్రలో పాల్గొన్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త: గంగ తెప్పోత్సవ కమిటి ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి తెప్పోత్సవం బోనాలు అత్యంత వైభవంగా కన్నుల పండవగా ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆనంతరం ఆయన శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఖైరతాబాద్ ఏడు గుళ్ళ నుంచి సాంప్రదాయబద్దంగా గంగమ్మతల్లిని పల్లకిలో ఉంచి, బోనాలతో ఊరేగింపుగా పోతరాజుల విన్యాసాలు, కోలాటాలతో గంగమ్మగుడి వద్దకు చేరుకుని హుస్సేన్‌సాగర్‌లో గంగ తెప్పో నిమజ్జనంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటి అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ్మబెస్త, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాలలకు 10 ఎమ్మెల్యేలు, 2 ఎంపీ సీట్లు కేటాయించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త: మాలలకు ప్రత్యేక రాజకీయ ఏర్పాటు చేయాలని మాల మహానాడు జాతీయ సంఘం సమావేశం నిర్ణయించింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్‌బాబు అధ్యక్షతన జరిగిన 'మాలలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి' అంశంపై చర్చా సమావేశం జరిగింది. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కృష్ణమూర్తి, జాతీయ కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్‌కుమార్, నాయకులు మన్నే శ్రీధర్‌రావు, రాందాస్, కోటేశ్వరరావు, అశోక్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. తెలంగాణలో మాలలకు ఏ రాజకీయ పార్టీ కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఇందులో భాగంగా ప్రత్యేక రాజకీయ పార్టీ అనివార్యంగా మారిందని సమావేశం అభిప్రాయపడింది. ప్రస్తుతం తెలంగాణలో ఒక్క మాల ఎంపి కూడా లేకఁపోవడం బాధారమని, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించిన, దళిత ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాలలకు ఈ రోజు రాజకీయ ప్రాధాన్యత లేకఁపోవడం విచారకరమని, అన్ని రాజకీయ పార్టీలు మాలలకు అత్యధికంగా ఎంపీ, ఎమ్మెల్యేల స్థానాలు కేటాయించకపోతే మాలల కోసం ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తామని సమావేశం హెచ్చరించింది.

## ఎస్సీ వర్గీకరణవాదులకు గుణపాఠం తప్పదు

నాంపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : జనాధా ప్రాతిపదిక రిజర్వేషన్లు పెంచలేని బిజెపి ఉన్నదాంట్లో మరింత వైరుధ్యాలు పెండే ఎస్సీ వర్గీకరణ వాదనను తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెరపైకి తేవడం సిగ్గుచేటని, తాను ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరిస్తున్న మణిపూర్‌లో గిరిజన రిజర్వేషన్లను రెచ్చగొట్టి మారణకాండకు శ్రీకారంచుట్టి అది చల్లారక ముందే తెలంగాణలో కూడా అలాంటి దుర్మార్గమైన ప్రక్రియకు బీజాలు వేస్తున్న బిజెపిని రాజకీయంగా అంతం చేస్తామని, రాజ్యాంగానికి వ్యతిరేకమైన వర్గీకరణ వాదులకు తగిన గుణపాఠం చెబుతామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ హెచ్చరించారు. మాలమహానాడు వ్యవస్థాపకుడు పి.వి.రావు 2000–2004 వరకు ఆనాటి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులు వేసినందువల్లనే వర్గీకరణ తప్పు అని, ఎస్సీల విభజన రాజ్యాంగ వ్యతిరేకమని 2004లో తీర్పు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. దీన్ని మరచిన పాలకవర్గాలు విస్మరించడం హేయమని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు.

## నేటి నుంచి ప్రజాభియాత్రకు శ్రీకారం

**తెలంగాణా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మన్నె క్రిషాంక్**



ఇందిరమ్మ నగర్‌లో నిర్వహించిన చివరి రోజు బస్తీ నిద్ర కార్యక్రమం లో మాట్లాడుతున్న మన్నె క్రిషాంక్

బేగంపేట ఆగస్టు 20, ప్రభాతవార్త : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో తాము నిర్వహించిన బస్తీ నిద్ర కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించిందని తెలంగాణా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మన్నె క్రిషాంక్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని వార్డు 2 ఇందిరమ్మ నగర్ లో బస్తీ నిద్ర చివరి రోజు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానికులు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో 35వేల ఓట్లను అనైతికంగా తొలగించారని, ఇది చాలా దారుణమని ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ క్రిషాంక్ దృష్టికి తీసుకు వచ్చారు. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి ఆయుధమని, దాని కోసం కల్సి పోరాడుదామని, ఈ విషయం తాను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసికెళ్లానని, ఆయన నుంచి సానుకూల స్పందన లభించిందన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు లేఖ కూడా రాసారని తెలియజేసారు. ఈ యాత్రలో తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి వీలైనంత వేగంగా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, యాదగిరి, రవి, మల్లేష్, రఘు, రమేష్, వినోద్, దినేష్, శ్రీకాంత్, ఎల్లేష్, భరత్, ప్రవీణ్, మోనీ, రాజు, ఫహీమ్, పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతకు 'ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారం'ప్రదానం

చిక్కడపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త: గాలిలో వేలాడే మాటలకు ఎప్పుడూ కూడా ఫలితం ఉండదని, దీని వల్ల సాధించేది ఏమి లేదని ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. ఇటువంటి వారిని కేవలం సెల్‌ఫోన్‌లలో, బుల్లితెరలపై తమకు నచ్చిన వారిని చూసుకుని మురిసిపోవడం తప్ప సాధించేది లేదన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతకు 'ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారం' ప్రదానోత్సవ సభ వేదిక అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా కవి నగ్నముని, ఆచార్య జయధీర్ తిరుమలరావు పాల్గొన్నారు.

## బహదూర్‌పురలో పక్కకు ఒరిగి పోయిన భవనం

చార్మినార్, ఆగష్టు 20 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్థుల భవనం పక్కకు ఒరిగింది. భవనం చుట్టు పక్కల ఉన్న ప్రజలను పోలీసులు ఖాళీ చేయించారు. భవనం నిర్మాణంలో ఉన్న భవనం కింది భాగంలో పగుళ్లు ఏర్పడ్డాయి. భవనం పక్కకు వంగటంతో భవనం పక్కనే ఉన్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. నిర్మాణంలో ఉన్న భవనం ఏ క్షణంలోనైనా కూలి పోయే ప్రమాదం ఉందని జిహెచ్ఎంసి అధికారులు అనుమానిస్తున్నారు. భవనం యజమానిపై కేసు నమోదు చేశామని బహదూర్‌పుర సిఐ అనిల్ కుమార్ వెల్లడించారు. కాగా బహదూర్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీలో పక్కకు ఒరిగి పోయిన భవనాన్ని సోమవారం కూల్చి వేయనున్నామని ఆయన తెలియజేశారు.



కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రోషన్‌రెడ్డి తదితరులు

## సిఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**కల్హేర్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** సిఎం కేసీఆర్ రూ.లక్ష వరకు రుణ మాఫీ ప్రకటించడంతో రైతులు సంబురాలు జరుపుకుంటున్నారు. ఆదివారం సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు గ్రామ రైతులు సిఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి తనయులు రాష్ట్ర యువనాయకులు రోషన్‌రెడ్డి పాల్గొని రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్‌రావుపాటిల్, గ్రామ సర్పంచ్ గంగామణి నర్సింలు,, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు సంజీవులు మండల సోషల్ మిడియా అధ్యక్షులు రమేష్, ఉప సర్పంచ్ నాగ భూషణం, దుర్గాగౌడ్, అశోక్, భూమయ్య, నాగయ్య, యువకులు గ్రామ రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాశీపూర్‌లో రామమందిర నిర్మాణానికి భూమి పూజ



రామమందిర నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

**కంది, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మండలంలోని కాశీపూర్ గ్రామంలో రామ మందిర నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు చింత ప్రభాకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామస్థులు, ఆలయ కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కిష్టయ్యకు ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళుతున్న తహసీల్దార్‌కు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

**చౌటకూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:** తహసీల్దార్‌గా రెండు సంవత్సరాల పాటు సేవలు అందించి బదిలీపై వెళుతున్న కష్టయ్యను ఆవివారం ఘనంగా వీడ్కోలు పలికారు. మండలం నుంచి జనగామ మండలానికి తహసీల్దార్‌గా బదిలీ కావడంతో రెవిన్యూ సిబ్బంది, రైతులు, మీ సేవా బాధ్యులు, నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మండలానికి అందించిన సేవలపై ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు.

## మూడవసారి కెసిఆర్ సిఎం కావాలి : ఎమ్మెల్సీ



చేర్యాల నకాశీపెయింటింగ్‌ను అందిస్తున్న కౌన్సిలర్ నరేందర్ తదితరులు

**చేర్యాల, ఆగస్టు 20, ప్రభాతవార్త :** మూడవసారి ముచ్చటగా కేసిఆర్ సీఎం కావాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మూడవసారి కేసిఆర్ సీఎం కావాలని ఆదివారం సిద్దిపేటజిల్లా కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామికి మొక్కుకున్నారు. అనంతరం చేర్యాలకు వచ్చిన శ్రీనివాస్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి చేర్యాల నకాశీ పేయింటింగ్‌ను అందజేశారు, కేసిఆర్ మూడవసారి సీఎం అయితే పల్లె, పట్టణాలన్ని బాగుపడతాయని, మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఆయనతో చేర్యాల మాజీ ఎంపిపి శ్రీధర్, వైస్‌ఎంపిపి నవీన్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, నరేందర్, ఎంపిటీసీల ఫోరం అధ్యక్షుడు గూడూరు బాల్‌రాజు, నాయకులు ఎర్రుల మహేష్, పచ్చిమడ్ల రాములు, నాజర్, కొలిపాక భాస్కర్, భారి ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 29న సదరం క్యాంప్ : జడ్పీటిసి సైతర మీనాక్షి

**మునిపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే సదరం శిబి రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటిసి సభ్యులు పైతర మీనాక్షి సాయికుమార్ పేర్కొన్నారు. శిబిరానికి సంబంధించి స్లాట్స్ ఈ నెల 22 నాడు కేటాయించినట్లు ఆమె వివరించారు. అర్హులైన వికలాంగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మీ సేవ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మీనాక్షి సూచించారు.

## ఇప్పెపల్లిలో బొంబు గొండేశ్వర విగ్రహావిష్కరణ

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన బొంబు గొండేశ్వర విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొగుడంపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు నారాయణయాదవ్, జహీరాబాద్ మండల అధ్యక్షులు తట్టు నారాయణయాదవ్, మాజీ ఎంపిపి అధ్యక్షులు విజయ్ కుమార్, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ దాసరి మచ్చుందర్, మొగుడంపల్లి ఎంపిటిసి సభ్యులు మహమ్మద్ కుతుబుద్దీన్, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బంగారి సురేష్, సంఘం నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు తుకారాం, హబ్బీ రాజు, ప్రసాద్, మారుతియాదవ్, రాంచందర్, లక్ష్మీకాంత్, శ్రీకాంత్, దేవయ్య, బక్కయ్య, గొల్ల కిష్టన్న, పెద్దగొల్ల రాజు, ఔటి సుభాష్, రావిశెట్టి నాగు, జి మైపాల్, గొల్ల వీర్‌శెట్టి, గొల్ల గుండప్ప, పోలీస్ మల్లన్న, యాదగిరి, శ్రీకాంత్, వెంకట్, విగ్నేష్, నవీన్, పాల్గొన్నారు.



బొంబుగొడేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే నివాసంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



జహీరాబాద్‌లో రాజీవ్‌గాంధీ జయంతిని జరుపుకుంటున్న కాంగ్రెస్‌నేతలు



జోగిపేటలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెద్దశంకరంపేటలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న దృశ్యం



మెదక్‌లో రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



నార్సింగిలో రాజీవ్‌గాంధీకి పూలమాల వేస్తున్న దృశ్యం

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

**నారాయణఖేడ్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** పట్టణంలో స్వర్గీయ పి.కిష్టారెడ్డి నివాసంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టరు పి.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులరిపించారు. ఈ కార్యక్రమంలో పి.చంద్రశేఖర్‌రెడి డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్‌కౌన్సిలర్లు దారం శంకర్‌సేట్, వివేకానంద, హన్మాండ్లు, సద్దాం, పీఎసీఎస్ ఛైర్మన్ శోభారాణి అశోక్‌రెడ్డి, అంజిరెడ్డి వైస్ ఛైర్మన్, గుండేరావు, యాదవరెడ్డి, నాయకులు యాదుల్ ఖురేషి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌నాయక్, సూకుమర్, కాంగ్రెస్ పార్టీ నాయకులుకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఆదివారం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఖండెం నర్సింలు, మండల అధ్యక్షులు పి.నరసింహారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు ఎండి ముల్తాన్, ప్రధాన కార్యదర్శి బి.మల్లికార్జున్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండి ఖాజా, ఎస్ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.భీమయ్య, మాజీ కౌన్సిలరు బేగం, మొగుడంపల్లి ఎంపిపి అధ్యక్షులు ప్రియాంక గుండారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

**జోగిపేటలో...**

**జోగిపేట, ఆగస్టు 20,ప్రభాతవార్త:** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రంగ సురేష్, మాజీ కౌన్సిలర్లు ప్రదీప్‌గౌడ్, శరత్‌బాబు, నాయకులు గుర్రం క్రిష్ణ, చిట్యాల మధు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో...**

**పెద్దశంకరంపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త:** పెద్ద శంకరంపేటలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి ప్రధానిగా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్, గంగారెడ్డి, హరికృష్ణ, వెంకటేశం, పాండు తదితరులు పాల్గొన్నారు.

**మెదక్ మండలంలో...**

**మెదక్ రూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** చిన్న వయసులో ఉన్న రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యారని టీపీసీసీ సభ్యులు మామిళ్ల ఆంజనేయులు అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హవేలి ఘనపూర్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మహమ్మద్ షఫీ, కాంగ్రెస్ నాయకులు రామారావు, ప్రభాకర్, పరమేష్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

**నార్సింగిలో...**

**నార్సింగి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆదివారం రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్‌చేసి అరటి పండ్లు పంపిణీ చేశారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కత్తి కార్తీకగౌడ్ ఆదేశానుసారం ఇరు వర్గాల కార్యకర్తలు నార్సింగి మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కుమ్మరి రవీందర్(జానీ) ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసి నాయకులు యాదగిరి యాదవ్, బీసీసెల్ భీమగారి,ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలు, ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులతో నర్సారెడ్డి

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నేతలు

**వర్గల్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** మండలంలోని అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రజలను సిఎం కెసిఆర్ మోసం చేస్తూ అప్పులపాలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు న్యాయం జరుగుతుందని అనుకుంటే సిఎం కెసిఆర్ నియంతృత్వ పాలన వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ చేరిన వారిలో ఎల్లంకుల చంద్రం, కాయిత సుధాకర్, బింగి సురేష్, గువ్వ అశోక్, దినేష్, నరేందర్‌లు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సందీప్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నాల రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, సుల్తాన్, పొన్నాల నర్సారెడ్డి, సదానందరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

## కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు



గవ్వలపలికలలె మిఠాయిలను పంచుతున్న మ్యాడం బాలక్రిష్ణ

**చిన్నశంకరంపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రం ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన దామోదర రాజనర్సింహు సీడబ్ల్యూసీలో శాశ్వత ఆహ్వానితులుగా నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేకి జిల్లా టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలక్రిష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండల పరిధి గవ్వలపల్లిలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపె లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యం గౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్,నాయకులు హఫీజ్,స్వామి, అశోక్ నాయక్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరిలో నేటి నుంచి సుదర్శన హోమం

**వర్గల్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని శ్రీనాచగిరి లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో ఈనెల 21వ తేదీ నుండి సెప్టెంబర్ 10వ తేదీ వరకు 21 రోజులపాటు శ్రీసుదర్శన మహాహోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు ఈ హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ దోషాల నివారణార్థం భక్తులు రూ.1100 చెల్లించి ఈ హోమ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే హోమ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

**-నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

**కొల్చారం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో మండల పరిధిలోని నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నాయిని చిన్న రాయన్న మోకాళ్ల చిప్ప మార్పిడి ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిందని, ఆపదలో ఉన్న వారిని ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసిఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మాట్లాడుతూ ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కర్రె సంజీవులు తదితరులు ఉన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

**మెదక్ అర్బన్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** అనివార్య కారణాల వల్ల ఈ నెల 21వ తేదీన సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం ఉండదని, ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ సూచించారు.

## గణనాథుడి సేవలో హద్నూర్ భక్తులు

**న్యాల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన 21 మంది భక్తులు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని హద్నూర్, రేజింతల్ గ్రామాల శివారులోని శ్రీవరసిద్ధి, శ్రీ సిద్ధివినాయక ఆలయాలను నిత్యం(శ్రావణ మాసం) ఉదయం 5 గంటల నుంచి దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ రావడం గత అయిదారు సంవత్సరాలుగా ఆనవాయితీగా మారింది. నెల రోజుల పాటు నిత్యం ఆలయాలను దర్శించుకుంటున్నామని, గ్రామ సుభిక్షంగా ఉండాలని సంకల్పంతో పవిత్ర శ్రావణ మాసంలో దైవదర్శనాలు చేసుకుంటున్నట్లు గ్రామ భక్తులు పేర్కొన్నారు. నిత్యం దైవ దర్శనాలతో శుభాలు కల్గుతున్నాయని నిత్యం దైవ దర్శనాలు చేసుకుంటున్న భక్తులు పేర్కొటున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మేలు చేస్తాయి

**కోహేడ, ఆగస్టు 20, ప్రభాతవార్త :** ఉచిత వైద్యశిబిరాలు పేదలకు మేలు చేస్తాయని గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గవ్వ వంశీధర్ రెడ్డి, కెల్విన్ అసుపత్రి చైర్మన్ చింతం సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కెల్విన్ అసుప్రతి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కోహేడ మండల పరిధిలోని పేదలకు మెరుగైన వైద్యం, వైద్య సలహాలు అందించ డానికే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పేదలను ఆదుకోవడమే గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమన్నారు. శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు గౌతమ్, తిరుకోవెల, వేణు, సప్తరుషి, ప్రశాంత్‌నాయక్, భూక్యా, వైద్య సిబ్బంది బాలకిషన్, నిషాని సంపత్, పూసల రాజశేఖర్, ములుగురి హరికృష్ణ, గడపే సుజిత్, శ్రవణ్, దర్గారెడ్డి, గవ్వ రాజిరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, అవినాష్, అరవింద్, జంపయ్య,సిద్దు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**ఝరాసంగం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగం లో రగోజి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పాల్గొన్నారు. నర్సింలు కుమారుడి వివాహం అంగరంగ వైభవంగా కొనసాగింది. వివాహ వేడుకలను హాజరైన ఎమ్మెల్యే మాణిక్‌రావు నూతన వధూవరులు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బొగ్గుల జగదీశ్వర్, శ్రీ కేతకి ఆలయ కమిటి సభ్యులు నాగన్న, మాలిపాటిల్ సంతోష్ కుమార్, బాబా, సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, ఝరాసంగం మాజీ సర్పంచ్ పెంటప్ప, నాయకులు శివతేజ, సునీల్, తరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దామోదర రాజనర్సింహ ఎంపిక పట్ల హర్షం

**రామాయంపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సీడబ్ల్యూసీ శాశ్వత కమిటి ఆహ్వానితులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ నియామకం పట్ల పీసీసీ సభ్యులు సుప్రభాత రావు, మ్యాడం బాలక్రిష్ణలు సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

## ముదిరాజ్ సంఘం అల్లాదుర్గం అధ్యక్షుడిగా మురాడి రాములు

**అల్లాదుర్గం, ఆగస్టు, 20 ప్రభాతవార్త:** అల్లాదుర్గం ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆకమిటీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గౌరవఅధ్యక్షులు బొంత లక్ష్మయ్య, అధ్యక్షులుగా మురాడి రాములు, ఉపాధ్యక్షులు కొన్యాల బుచ్చయ్య, ప్రధాన కారదర్శి బోయిన బేతయ్య, కార్యవర్గ సభ్యులుగా పెంటయ్య, భాగయ్య, వెంకటేశం, దాకయ్య, తదితరులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

## కెసిఆర్, పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం

**నార్సింగి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సంకాపూర్ గ్రామం లో ఆదివారం గామపంచాయతీ వద్ద సిఎం కేసీఆర్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కొరకు 20 లక్షల రూపాయల నిధులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మరెన్నో అభివృద్ధి పనులు మా గ్రామానికి తీసుకొచ్చి సహకరించాలని ఎమ్మెల్యేను కోరుతున్నామన్నారు. నూతన గ్రామపంచాయతీ కొరకు సహకరించిన ఎంపీపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పట్లూరి రాజన్న, మైలారం బాబకు సంకాపూర్ టీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మరియు 23 వ తేదీన జరగబోయే సీఎం భారీ బహిరంగసభకు పెద్దఎత్తున తరలిరావాలని, సభను విజయవంతం చేయవలసిందిగా కోరడమైందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్, పద్మాదేవేందర్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



ఆత్మీయ సమ్మేళనములో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నార్సింగి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఎంపిటీసి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవనంలో 1990-91 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. గతంలో చదువుకున్న పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా రోజంతా సంతోషంగా గడిపారు. అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో చేసిన అల్లరిని గడచిన రోజుల ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు జీవనోపాధి మార్గాలు అన్ని పంచుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు ఉప్పల శ్రీనివాస్, కోవూరు శ్రీనివాస్, కుకుట్ల రమేష్, మంగలి రాములు, గౌడ శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్, చుంచు శ్రీనివాస్, సురేష్, వేణు,హరిత, పాణి, సౌజన్య వెంకటరమణరెడ్డి, మహేస్, చంద్రం, ఎంకె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ. లక్ష ఆర్థిక సహాయం



రామమందిర నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందచేస్తున్న రాజు

**సంగారెడ్డి, ఆగస్టు 20, ప్రభాతవార్త:** కంది మండలం కాశీపూర్ గ్రామంలో శ్రీరామ మందిర నిర్మాణానికి బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు ఆదివారం లక్ష రూపాయల విరాళాన్ని అందచేశారు. ఆలయ నిర్మాణ కార్యక్రమానికి హాజరైన పులిమామిడి రాజు నిర్మాణ పనులకు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణ కమిటి బాధ్యులు పులిమామిడి రాజును ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసిన పులిమామిడి రాజును ఆలయ కమిటి బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు, గ్రామస్థులు, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో పిచ్చిమొక్కల తొలగింపు

**న్యాల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపునకు ఆదివారం పంచాయతీ ఆధ్వర్యంలో మందును పిచికారి చేశారు. పిచ్చి మొక్కలపై మందు పిచికారి చేస్తే అవి అక్కడికి అక్కడే ఎండిపోతాయని, ఫలితంగా దోమలు పెరగవని పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ మఠం శివశంకరయ్యస్వామి పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ఎవరికి వారు చర్యలు తీసుకుంటే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, ఫలితంగా గ్రామంలో ఆరోగ్యంగా ఉండే అవకాశాలు ఉంటాయని సర్పంచ్ సూచించారు.

## కాంగ్రెస్ నాయకులకు సన్మానం

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పదువులు పొందిన నాయకులను ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పదవులు అందుకున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎండి ముల్తాన్, ప్రధానకార్యదర్శి బి.మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఆర్టిఐ చైర్మన్ న్యాయవాది నతనైల్‌లను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కండెం నర్సింలు, నరసింహ రెడ్డి, ఎండ ఖాజా, కే భీమయ్య, గుండారెడ్డి, ఉదయ్ శంకర్‌పాటిల్ పాల్గొన్నారు.



జిల్లాస్థాయిలో పదవులు పొందిన నాయకులను సన్మానిస్తున్న దృశ్యం